

మనసు




"అమ్మా, నువ్వెళ్ళు. నేను తరవాత వస్తాను . . . తమ్ముణ్ణి పంపించు."

"వెళుతున్నాను మరి. . . బాబూ, దిగులుపడమాక. . . దేవుడు చల్లగా చూస్తాడు. తప్పక నయమవుతుంది."

"అమ్మాయ్! వాళ్లమ్మా వాళ్లకు తంతీ అదీ చూడమ్మా. ఇటువంటి సమయంలో కన్నవాళ్లు, కడుపు తీపి వాళ్లు దగ్గర ఉండటం ఎంతైనా అవసరం." ఆ తల్లి గొంతు బొంగురు పోయింది.

ఆమె బయటికి వెళ్లిపోతుంటే, లోపలికి వస్తున్న నర్సు జాలిగా చూసింది.

ఒక్క క్షణం నిశ్శబ్దం!

సంధ్యచీకట్ల తెరలు ఒక్కొక్కటే పడుతున్నాయి. నెలవంక నీలాకాశంలో నిలిచాడు.

సముద్రపు అలలను ముద్దాడి వస్తున్న చల్లని గాలి ఆ ఆసుపత్రి మూడు అంతస్తుల వార్డుల్లోకి ప్రవేశించి మనసుకి కాకపోయినా భౌతికంగా సేద దీర్చుతూంది.

తన పని ముగించి, లైటు వెలిగించి, "ఒక గంట పోయాక మళ్లీ వస్తాను" అని వెళ్లిపోయింది నర్సు, నిర్ణీత కాల ప్రకారం. వెళ్లిపోతూ, "చీకటి చేదుగా ఉంటుందంటారు — ఇదేనేమో?" అంది.

వినీలాకాశంలోకి, నల్లని మబ్బుల గుంపుల కలయికల్లోంచి అప్పుడే రాలి పోతున్న తారకను చూస్తున్న ఇందిర ఉలిక్కిపడింది!

ఆమెకు మాటలు కరువైపోయాయి.

గదిలో సన్నని వెలుతురు. కిటికీ లోంచి కెరటాలను కవ్వించిన గాలి తెరలు. కాని, మనస్సులో సుడులు!

"ఇందిరా!" అంతవరకూ మౌనంగా ఉండిపోయిన కృష్ణబాబు పిలిచాడు.

"కృష్ణా!" ఇందిర గొంతు దుఃఖ పూరితమైంది.

"ఇందూ! బాధ పడుతున్నావా?" అనబోయి తనలో తానే నీరసంగా నవ్వుకున్నాడు. తన పిచ్చి! బాధకాదూ? పుట్టిన ఊరు వదిలి, ఇలా దొరికిన ఉద్యోగం కోసం ఇంత దూరం వస్తే, 'అందరికీ దూరంగా ఉన్నాను' అన్న తన దిగులును తుడిచిపెట్టేసి, ఎంతో ఆత్మీయంగా, ఆదరంగా మానవ హృదయంతో నిలువ నీడ నిచ్చిన ఆ దంపతులు, వాళ్ల బిడ్డల మనస్సుల్లో ఉండేది బాధ కాదూ? రగిలేది వేదన కాదూ? చెప్పలేని ఆత్మీయతానుబంధానికి కట్టుబడిపోయిన మనస్సుల్లో ఇంకేం ఉంటుంది, ఈ సమయంలో? సృష్టి చిత్రాన్ని వీక్షించే కళ్లకు మరింకేమీ కనపడవు అనుకుంటే, మనసు పడే మడతలు! తను ఇక లోకాన్ని చూడలేడు మరి!

"ఎలాగో గుండె గట్టి చేసుకోవాలి, ఇందూ. నీ లోని అలజడి మాటలను మింగేస్తోంది. దిగులు చెంది మనస్సు నీరు చేసుకోవద్దు, ఇందూ!" అంటున్నాడు కృష్ణబాబు.

ఇందిర సజల నయనాలు కొన్ని క్షణాలు నిబ్బరం తప్పిపోయాయి!

"గుండె చెరువు అవుతుంటే ఏం చేయను, కృష్ణా!" అనబోయి ఆగిపోయింది. 'అతడు తనకి ధైర్యం చెపుతున్నాడు! జీవితపు పుటపై ఇక అక్షరాలు కనిపించవని తెలిసీ, తియ్యని ఊహల స్వరూపం కలలపరమే అయిపోతున్నా తనను ఊరడిస్తున్నాడు! నిస్తేజమైన అతడి కళ్లు కానరాని తన కళ్లలో నీళ్లు నిలుస్తున్నాయేమోనని, వాటిని తుడిచి వేయాలని ప్రయత్నం చేస్తున్నాయి. కృష్ణా! నీలో ఇంత నిబ్బరం నిగూఢమై ఉందా? ఈ స్థితిలో నిన్ను ఓదార్చవలసింది పోయి, నన్ను నీవు ఓదారుస్తున్నావా?'

"గంట అయిందేమో సైరన్ వినిపించి? చీకటి పడి ఉంటుంది కదూ? లైటు వెలిగించు, ఇందూ."

ఇందిర మనస్సు విలవిల్లాడింది. 'ఈ కాంతిపుంజం నీ కంటితెరలపై నిలుస్తుందా?' అనుకొంది. 'అతడికి పగలు, చీకటి ఒకటే! పగలు, చీకటి మధ్య ఉన్న రేఖ ఎటువంటిదో మరి!' ఇందిర పిచ్చిగా నవ్వుకొంది.

మరి ఆలోచించడానికి భయం వేసింది ఇందిరకు.

'కృష్ణకు కళ్లు మళ్లీ రావా?' ఆమె మనస్సు ఊరుకోవడం లేదు.

## 'సయనారా'

"అవును, మరి. డాక్టరు చెప్పింది అంతేగా! హృదయం చిల్లులు పడేలా అతడు కాలచక్రంలో రాత్రీ, పగలూ లాంటివి మరిచిపోవాలి, ఇక" అని.

డాక్టర్ ఎంత కఠినంగా చెప్పారు! లేదు, లేదు. . . చెప్పలేక, చెప్పలేక డాక్టరుగా, తన కర్తవ్యంగా కంటిపాప ముందు రెండు నీటిబిందువులు నిలువగా అన్నారు. జాలిగా చూశారు!

అసలు ఆక్సిడెంటు ఎందుకు జరిగింది?

"ఇందూ! నే నేం చెప్పను? నువ్విలా మూగగా ఉంటే, మనస్సుకూడా చీకటి తెరల్లో పడిపోతుందేమో? అయిపోయిం దానికి ఎంతసేపని బాధపడుతూ కూర్చుంటాం!"

"కృష్ణా!"

"అవును, ఇందూ! జీవితం నిర్వికారంగా కనిపిస్తోంది కదూ! ఆ స్థితి నుండి బయటపడాలి...బయటపడాలి."

"అమ్మకి టెలిగ్రామ్ ఇచ్చి వస్తాను." ఎలాగో చివరికి అంది ఇందిర.


"అంత పని మాత్రం చేయకు!" కలవరపడిపోయాడు కృష్ణబాబు.

ఇందిర ఆశ్చర్యంగానూ, విచిత్రంగానూ చూసింది అతణ్ణి.

"అమ్మకి టెలిగ్రామ్ ఇస్తాను." మళ్లీ అనబోయింది. కాని, అనలేదు.

'ఒక తల్లికి తన బిడ్డడు కనుపాప! తన జీవితానికి అర్థాన్ని కల్పించే చిహ్నం తనయుడు. తన సర్వస్వానికి మారుపేరు కడుపుపంట! ఆ పంట గుండె మంటలైతే? ఆ తల్లి హృదయం, కన్న హృదయంలోని ఆరాటానికి, ఆవేదనకు చివరి అంచు ఏమిటి?

ముద్దు చేసి, ఏడ్చినప్పుడు నవ్వించి, లాలించి, ఆకసంలో నిండుగా వెన్నెలను కురిపించే జాబిల్లిని చూపిస్తూ, తన బంగారపు పంట పసిడి కన్నుల్లో ఆ వెలుగు కాంతులీనుతుంటే చూసి తన్మయత్వం పొందే తల్లికి, "మీ



శిల్ప సంపద (కోణార్క)
ఫోటో—వి. వి. ప్రభాకర్ (మద్రాసు-86)

అబ్బాయి. . ." అని తను టెలిగ్రామ్ ఇవ్వాలి!

ఇవ్వకుండా తప్పుతుందా మరి?'

"ఇందూ! రెండు రోజుల్లో నన్ను బయటి ప్రపంచంలోకి పంపిస్తారు."

"అందుకే మీ వాళ్ళకి తెలియ జేయాలని. . ." ఆమె పూర్తి చేయలేదు.

"ఇందూ! నన్నెందుకు దూరం చేస్తావు?"

"దూరం? లేదు, కృష్ణా! ఎంత స్నేహితురాలినైనా, ఇటువంటి స్థితిలో మీ వాళ్ళ దగ్గర ఉంటే. . ." అనాలనుకుని అనలేదు.

"ఇందూ! ఏదో అనేస్తున్నాను. ఏం అనుకోకు."

"నిన్ను చూస్తూంటే . ."

"బాధగా ఉంది అంటావు. . . అలాగని కూర్చుంటే ఎలా మరి? లే మరి. కాగితం, పెన్ను తీసుకో. కాస్త ఉత్తరం వ్రాసిపెట్టు. నే చెపుతుంటాను. మనస్సు పదిలపరుచుకొని వ్రాసిపెట్టు."

ఇందిర మౌనంగా కాగితం, కలం తీసుకొని, కిటికీలోంచి చూస్తూ కూర్చుంది.

"ఊఁ! నీ వాలకం చూస్తుంటే అలవాటుగా అడిగేదానికన్నా, 'ఈ కాస్త సాయం చేసి పెట్టు' అని వేడుకోవాలి కాబోలు!" కృష్ణబాబు కాస్త కోపం తెచ్చుకుని అన్నాడు.

"అంత మాట అనకు. ఇదిగో, నేను సిద్ధంగానే ఉన్నాను." ఆమె గొంతులో జీర.

అతడి మనస్సు కలవరపడింది. "నిన్ను బాధపెట్టాలని కాదు, ఇందూ!"

"అవును. నాకు ధైర్యం చెపుతున్నావు."

"మనం తరవాత తీరిగ్గా వాదించుకోవచ్చు. ఉత్తరం మొదలుపెట్టు."

'అమ్మా! ఇన్ని రోజులూ ఎదురు చూసిన శుభదినం వచ్చింది. కూతురు ఒకింటిది కావాలని తపించిపోయావు. అది ఒకింటిది అయేందుకు కావలసిన డబ్బు సమకూడింది. నాకూ చాలా ఆనందంగా ఉంది— ఈ నాటికి చెల్లెలు పెళ్ళి చేసుకొని మరో ఇంటిని తన ఇల్లుగా చేసుకునే రోజు వచ్చిందని. డబ్బు పంపుతున్నాను. ఇక అన్ని పనులూ చూడవలసింది. అవసరమైన పనుల వలన నేను ఇప్పుడే రాలేకపోతున్నాను. . .' చెపుతున్నవాడల్లా ఆగి, మళ్ళీ అన్నాడు:

"శుభం అని వ్రాసి ముగించేయి ఉత్తరం."

దిండు క్రిందనుండి కాగితం రూపంలో ఉన్న డబ్బును తీసి "దీన్ని దానితో జత పరుచు. . . ఏదీ ఉత్తరం? ఎక్కడ సంతకం పెట్టాలో అక్కడ ఈ చేతికి అందించు. . . గుడ్డిగా సంతకం పెట్టేస్తాను" అంటూంటే ఇందిరకు దుఃఖం ఆగలేదు.

యాంత్రికంగా అతడు చెప్పినట్లు చేసింది.

"ఇందూ! నీ లోని— ఉబికి వస్తున్న దుఃఖపుఘోషను వింటున్నాను. ఈ స్నేహితుడికి ఈమాత్రం చేసి పెట్టేందుకు నీవు ఉన్నావన్న భావనే నాకు ఊరట కలిగిస్తూంది."

"అబద్ధాలు ఎప్పటినుండి నేర్చుకున్నావు?" నిర్లిప్తంగా అంది.

"అబద్ధం?" వేదాంతిలా నవ్వాడు.

"కాదూ? కన్నతల్లికి వ్రాస్తున్నది ఇదా? నువ్వు సుఖంగా ఉన్నావా? అవసరమైన పనులూ అవీనూ!"

"పిచ్చి ఇందూ! నిజం వ్రాయమంటావా? ఒక్కొక్కప్పుడు అబద్ధం తియ్యగా ఉంటుంది. ఇప్పుడూ అంతే... నిజం చేదుగానూ ఉంటుంది. . . ఇప్పుడూ అంతే. ఈమాత్రం నీకు అర్థం కాదని అనుకోను."

"నీ మనస్తత్త్వం తెలియదా, కృష్ణా!" నిట్టూర్చింది ఇందిర.

"చేదునిజాలు ఎలా ఉంటాయో నా డైరీ చదువు, తెలుస్తుంది."

"ఇంతకుముందే చనువు కొద్దీ చదివాను... ఇన్నాళ్ళూ నీ వేమైపోయావో మా ఇంట్లో ఎవరికీ అర్థం కాలేదు. ఎప్పుడూ చెప్పకుండా వెళ్ళనివాడవు, ఉన్నట్టుండి కనపడలేదు. నాన్న ఒకటే ఇదై పోయారు."

"అయితే మీకు ఎంతో ఋణపడి ఉన్నాను. నా యోగక్షేమాలు అంతగా పట్టించుకొనేవా రున్నారంటే ఎంతో ఆనందంగా ఉంది, ఇందూ!"

"మా ఇంట్లో ఉంటున్నప్పుడు, అది మా బాధ్యతే అనుకొన్నాము కానీ, ఇలా అయింది." ఆమె గొంతు గాద్గదికమైంది.

"నీ డైరీని చూస్తుంటే, నీ లోని వేదనకు కారణాలూ తెలిసినాయి. కాని..."

"కానీ. . . అర్థంకానిది?"

"చివరి పుటలు చింపేశావు. ఎందుకని? వ్రాసుకున్నాక, ఆ పుటల్లో జీవితం— నిజం భరించలేనంత చేదుగా కనిపించిందా?"

"కాదు మరీ! దేవుడు చింపిన పుటలు అవి. అవి అంతేకదూ? ఇప్పు డనిపిస్తుంది, ఏదొచ్చినా మన మంచి కోసమే అని. లేకపోతే ఈ ఆక్సిడెంటు ఏమిటి? పరిహారమేమిటి? దేవుడే ఆ ధనవంతుని రూపంలో వచ్చాడు. విధి విచిత్రంగా లేదూ?

"ఇన్నాళ్ళూ అమ్మది ఒకటే దిగులు— కూతురి పెళ్ళి ఎలా అవుతుందా—

ఆమె తట్టుకోలేకపోవచ్చు. ఇందూ, అలా కాకూడదు. అంతే!''

''నా కేం చెప్పాలో తెలియకుండా ఉంది, కృష్ణా!''

''అందుకే నేను చెప్పినట్లు చేయి. ఎలాగూ ఇక బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టాలి. చూపు లేని వాళ్ళు పనీ పాటా చేసే కార్యాలయంలో నన్ను వదిలేస్తే నీకు ఎంతన్నా ఋణపడి ఉంటాను!'' అతడు నిర్వికారంగా అన్నాడు.

''కృష్ణా!'' ఆమె మనసు అరవలేక పోయింది.

మనస్సుల్లో మంటల స్వరూపం అటువంటిది.

''ఇందూ, నీవు దురదృష్టవంతు రాలివి అయిపోయావు. నేను ఏమై పోయిందీ వెతుక్కొంటూ రాకపోయి ఉంటే, ఏ నర్సు అన్నా సహాయం చేసేది. కానీ, నీవు వచ్చావు. నిన్ను సహాయం ఎలా అడగను? 'నువ్వు' అని అనగల ఆత్మీయతతో 'ఇది చేయి, ఇందూ' అనే అనగలుగుతున్నాను. బహుశా స్నేహం పూసిన పువ్వులు ఇవేనేమో?''

''అలా అనవద్దు, కృష్ణా! నీకు తప్పక మళ్ళీ చూపు వస్తుంది. తప్పక వస్తుంది . . .'' ఆమెలో ఆశ.

''నీ నమ్మకం నేను కాదననా? దేవుడు నవ్వితే కాదనే వాళ్ళు ఎవరూ? కర్మ గుడ్డిది కాదూ? మనిషి అంత పిచ్చి నమ్మకం పెంచుకోకుండా ఉంటే మంచిదేమో!''

''నా మనస్సు చెపుతూంది, కృష్ణా!''

''అది ఆత్మీయతో,ఏదో పలికిస్తూండ వచ్చు. అది సరేగాని, ఈ ఉత్తరం అదీ చూడు ముందు.''

ఇందిర నీరసంగా కదిలింది. ఆమె మనస్సు ఉద్వేగభరిత మవుతూంది. దిటవు తప్పిన హృదయం గుబగుబ కొట్టుకొంటూంది. యాంత్రికంగా, బరువుగా అడుగులు వేస్తూంది.

''ఈ లోకంలో అసాధ్యమైంది లేదేమో! ఈయన కళ్ళు తీసి ఆ డబ్బు గల ఆసామీకి అమర్చారు. ఆయనకు చూపు వచ్చింది. డబ్బే లోకంగా తనివి తీరా చూసుకోవచ్చు. . . పాపం. . . అతడు డబ్బు కోసం. . .'' నర్సులు అనుకొంటున్నారు.

ఇందిర వేస్తున్న అడుగు ముందుకూ పడలేదు, వెనక్కూ పడలేదు. నర్సులు ఇద్దరూ ఆమె వైపు పరుగెత్తారు. ★

# మేఘాల విశేషాలు

**వి. ఎస్. ఆర్. మౌళి**

నిత్యం మన జీవితంలో ప్రముఖ పాత్ర వహించిన మేఘాల గురించి తెలుసుకోవడం అవసరం. వీని విశేషాలు మనలో కుతూహలం కలిగిస్తాయి. భూమిమీద ఎన్నో అంగుళాల వర్షం కురుస్తూ ఉంటుంది. ఆకాశంలో ఏర్పడిన మేఘాల ద్వారా ఈ వర్షం పడుతుంది. అయితే ఈ మేఘా లెలా ఏర్పడతాయి? వాని కథ ఏమిటి? నదీజలాలనుండి, సముద్రంనుండి ఈ మేఘాలు ఏర్పడ తాయి.

భూమిలో 7/10 వ వంతు కన్నా అధిక భాగం నీరు ఆవరించుకొని ఉంది. సూర్యుని వేడికిరణాలు నీటి అలలమీద పడి తళతళ మెరుస్తాయి. అందులో కొంత నీరు వాయువుగాను, ఆవిరిగాను మారుతుంది. దీనినే ఆవిరి అగుట అంటారు. ఒక కుండలో నీరు మరగించినప్పుడు కొంతసేపటికి నీరు తగ్గిపోతుంది. దీనికి కారణం కొంత నీరు ఆవిరిగా మారిపోవడమే.

ప్రతి దినం సూర్యకిరణాలు సోకి అనేక టన్నుల నీరు ఆవిరి అయి పోతుంది. ఈ ఆవిరి మన కంటికి కనిపించకపోయినా, ఆకసంలోని కెగసి చిన్న చిన్న నీటి తుంపర్లుగా మారిపోతుంది. ఈ తుంపర్లు ఒకదా న్నొకటి అంటుకొని ఉన్నప్పుడు కనిపిస్తాయి. కనిపించిన ఈ నీటి తుంపర్ల సముదాయాన్నే మనం మేఘాలు లేక మబ్బులు అని పిలుస్తాం.

శీతకాలంలో మనం గాలిని లోనికి పీల్చినప్పుడు మన ఊపిరి చిన్న చిన్న మబ్బుతెరల క్రింద మారి నోటిముందు నిలుస్తాయి. దీనిని 'సంక్షేపం' అంటారు. ఈ విధానమే గాలిలోకూడా జరుగుతుంది.

ఆవిరి గుట్టలుగా పైకి పోయి, అచ్చట చల్లని గాలితో కలుస్తుంది. వెంటనే ఆవిరి చల్లబడి నీటిచుక్కలుగా మారు తుంది. ఆవిరిలో కలిగిన ఈ మార్పు కేవలం అది చల్లబడడం వల్లనే కాదు. దీనికి మరొక విధానముంది. నీటినుండి పైకి లేచిన ఆవిరి పైకెగసి పోతుంది. గాలి ఒత్తిడి ఎక్కువ లేని స్థలం చేరేసరికి ఆవిరి విస్తరించి చల్లబడుతుంది. దాని ఫలితంగా మబ్బులు ఏర్పడతాయి.

మేఘాల్లో రెండు విధా లున్నాయి. ఆవిరి పైకి లేచి చల్లగాలితో కలిసి సంక్షేపం పొంది మేఘాలు ఏర్పడతాయి. ఇవి గుట్టలుగా కలుస్తాయి. వీనిని 'క్యుములస్' అంటారు. ఆవిరి పైకెగసి, గాలి ఒత్తిడి తక్కువగా ఉన్న ప్రదేశంలో విస్తరించి మేఘా లేర్పడతాయి. ఇవి ఏటవాలుగా ఉండి పెద్ద పలకల వలె ఉంటాయి. వీనిని 'స్ట్రేటస్' అంటారు. కానీ, సాధారణంగా ఆవిరి సంక్షేపించి, నీటిబొట్లుగా మారి మేఘాలుగా మార డానికి అవకాశం తక్కువ. ఈ నీటి బిందువులు దేనినైనా అంటి పెట్టుకుని ఉండాలి. ఇనుపరజనునిఅయస్కాంతంఎలా ఆకర్షిస్తుందో, అలాగే ఈ నీటిబిందువులు దేన్నయినా అంటిపెట్టుకుని ఉండాలి. వాతావరణంలో ధూళి ఉన్నప్పటికి అది ఆవిరిని ఆకర్షించదు. సముద్రపు లవణాలు, సల్ఫ్యూరిక్ ఆమ్లం మొదలగు వాని అణువులు గాలిచుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఈ అణువుల చుట్టూ నీటిబొట్లు ఏర్పడతాయి.

తేమతో కూడిన మేఘం చల్లని గాలితరంగాన్ని ఢీకొన్నప్పుడు పెద్ద శబ్దం ఏర్పడుతుంది. దీనిని మేఘగర్జన లేక ఉరుములు అంటారు. ఇవి సాధారణంగా వేడి కాలంలో సంభవిస్తాయి. పర్వత వాలుల్లోను, పొడి ప్రదేశాల్లోను అధికంగా ఉంటాయి. ఇటువంటప్పుడు కుండ పోతగా వర్షం పడడం, మెరుపులు మెరవడం సంభవిస్తాయి.

మేఘాల వలన ఆధునిక విమానాలకి ఇబ్బంది ఉంది. మేఘం అతి చల్లనిదైతే విమానం చుట్టూ మంచు పొరలు కమ్మేస్తాయి. ఒక్కో సమయంలో విమానం రాకపోకలకి అంతరాయం కలిగిస్తాయి.

కనిపించే మేఘాలన్నీ వర్షించవు. ఒక మేఘం వేడిగాలిలోకి ప్రవేశించినా, అధిక ఒత్తిడి కలిగిన గాలి లోనికి చొర బడినా నీటిబిందువులు ఒకదాని కొకటి అంటుకుంటాయి. అలా జరిగినప్పుడు వాని బరువు పెరిగి వర్షరూపంలో భూమిమీద పడతాయి. ఆవిరి రూపంలో పోయిన నీరు తిరిగి వర్షరూపంలో పడి తిరిగి ఆకాశంలోనికి ఆవిరిగా పోతుంది.

'సిరస్' అను మేఘాలు అన్నింటి కన్నా ఎత్తు పోగలవు. ఇవి సుమారు 50,000 అడుగుల ఎత్తు పోతాయి. సూక్ష్మమైన మంచు ముక్కల ద్వారా ఇవి ఏర్పడతాయి. ఆకాశానికి అడ్డుగా గంటకు నూరు నుండి రెండు వందల మైళ్ల వేగంతో ప్రయాణం చేస్తాయి. ఇవి గాలికి చెదిరిన ముంగురుల వలె ఉంటాయి.

'సిరోస్ట్రేటస్' అను మేఘాలు ఆకాశానికి మేలిముసుగు తొడిగినట్లుం టాయి. ఇవి సూర్యుని ముందునుండి గాని, చంద్రుని ముందునుండి గాని పోయినట్లయిన పెద్దవిగా మారి, మెరిసే వలయంగా ఏర్పడతాయి. దీనిని పరిధి అంటారు. 'సిరోక్యుములస్' మేఘాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. ఇసుకలో లేచే అలలవలె ఉంటాయి.

'ఆల్టోస్ట్రేటస్' మేఘాలు బూడిద రంగు లేక నీలిరంగు ముసుగులా కనిపిస్తాయి. సూర్యుని ముందీ మేఘాలు ఉన్నప్పటికీ మనం వీని చాటు నుండి సూర్యుని చూడగలం. 'ఆల్టోక్యుములస్' అను మేఘాలు సూర్యచంద్రుల ముందు నుండి వెళ్లినప్పుడు ఒక దానితో ఒకటిగా కలిసిన విపరీతమయిన కాంతిచక్రాలు ఏర్పడతాయి. దీనిని 'కొరోనా' అంటారు.

'క్యుములోనింబస్' అను మేఘముల వలన గాలివాన లేర్పడతాయి. ఇవి చాలా ఎత్తయిన మేఘాలు. కొన్ని సమయాల్లో వీని చివర్లు భూమిని తాకుతాయి. వానిపైభాగం 65,000 అడుగుల ఎత్తులో ఉంటుంది.

'స్ట్రేటోక్యుములస్' మృదువుగా ఉండి, ఊదా రంగులో ఉంటాయి. వీనివలన వర్షం రాదు. స్ట్రేటస్ మేఘాలు ఏటవాలుగా ఉండి, ఊదా రంగులో పంకలవలె ఉంటాయి. ఇవి భూమికి కాస్త దూరంలోనే అటు, ఇటు తిరుగు తాయి.

'క్యుములస్' అను మేఘాలు దళసరిగా ఉండి,తెల్లగా ఉంటాయి. ఇవిసాధారణంగా పగటిపూట కనిపిస్తాయి. 'నింబస్' అను మేఘాలు దట్టంగా ఉండి, నిత్యం వర్షాన్ని కంగజేస్తాయి.

మేఘాల గురించి అనేక కథ లున్నాయి. పూర్వకాలంలో మేఘాలు ఏ దిక్కు నున్నాయో చూసి నావికులు రాబోయే రోజు పరిస్థితిని ఊహించేవారట. వ్యవసాయదారులు మేఘాలనుబట్టి, వాతావరణాన్ని చెప్పేవారట. ★

## సుఖాలు

**ఒక కష్టం తరవాత వచ్చే సుఖమే నిజమైన సుఖం... నిజమైన సుఖా లన్నీ కష్టాలకు అవతలి తీరాన ఉంటాయి. నిజమైన సుఖాలు అనుభవించాలంటే ముందుగా కష్టపడాలి. కృత్రిమ మైన సుఖాలు అనుభవిస్తే, తరవాత నరకం అనుభవించక తప్పదు.**

—జాన్ ఫాస్టర్